RNI No: TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:52 | జనవరి 30, 2026 | వెల: రూ.3-00





## వనం నుంచి జనంలోకి సమ్మక్క తల్లి

### సంప్రదాయబద్ధంగా చిలకలగుట్ట నుంచి తోడ్కొని వచ్చిన గిరిజన పూజారులు

# శివాలెత్తిన అరణ్యం!



- అత్యంత భక్తి శ్రద్ధల నడుమ కీలక ఘట్టం
- పూనకాలతో ఊగిపోయిన శివసత్తులు, వడ్డెలు
- ఉద్విగ్న భరితంగా మారిన లక్షలాది దేహాలు
- గద్దెలపై దేవతల సమాగమంతో జాతరకు నిండుదనం
- రెండ్రోజుల పాటు కొనసాగనున్న భక్తుల మొక్కులు
- కిక్కిరిసిన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు
- తల్లులను దర్శించుకున్న రాష్ట్రస్థాయి ప్రముఖులు
- నిఘా నీడలో తడ్వాయి అటవీ ప్రాంతం

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ అడవి తల్లి సాక్షిగా సాగే ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా మేడారం జాతరలో అత్యంత కీలకమైన, ఉద్విగ్న భరితమైన ఘట్టం ఆవిష్కృతమైంది. కోట్లాది మంది ఆశల తల్లి, అన్యాయంపై ఎదిరించి పోరాడిన వీరవనిత సమ్మక్క తల్లి గురువారం రాత్రి 9.43కు గద్దెపైన కొలువుదీరింది. చిలకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో తల్లి కదిలివచ్చిన వేళ.. తాడ్వాయి అరణ్యం ఒక్కసారిగా పూనకాలతో ఊగిపోయింది. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో మేడారం జనారణ్యంగా మారింది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులతో కలిసి సమ్మక్క తల్లి కూడా గద్దెపైకి చేరడంతో వనదేవతల సమాగమం పరిపూర్ణమైంది. పోలీసుల అధికారిక లాంఛనాలు, ఏఐ టెక్నాలజీ నిఘా, ప్రముఖుల సందడి మధ్య మేడారం అణువణువునా ఆధ్యాత్మిక తన్మయత్వం ఉట్టిపడుతోంది. ఇసుకవేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిన జంపన్నవాగు, తల్లులకు బంగారం సమర్పించుకుంటున్న భక్తకోటితో మేడారం ఇప్పుడు ఒక అద్భుత ఆధ్యాత్మిక లోకాన్ని తలపిస్తోంది.







# కేసీఆర్‌కు ‘సిట్’ నోటీసులు!

## తెలంగాణ రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్

- నేడు విచారణకు అందుబాటులో ఉండాలని సూచన
- సమయం కావాలంటూ లేఖ రాసిన గులాబీ అధినేత
- సానుకూలంగా స్పందించిన సిట్..
- కారు పార్టీలో మున్సిపల్ ఎన్నికల టెన్షన్
- ఇప్పటికే కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావుల విచారణ పూర్తి
- ఇప్పుడు నేరుగా గులాబీ బాస్ వంతు
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలో బీఆర్ఎస్ కేడర్

2లో

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు తుది అంకానికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ నిఘాపై ఆరా తీస్తున్న ప్రత్యేక విచారణ బృందం, ఏకంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు నోటీసులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరగాల్సి ఉండగా, అనూహ్య మలుపు చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న తరుణంలో, తాను రాజకీయంగా బిజీగా ఉన్నానని, విచారణకు మరింత సమయం కావాలని కేసీఆర్ ‘సిట్’కు లేఖ రాయడంతో అధికారులు సానుకూలంగా స్పందించి నేటి విచారణను వాయిదా వేశారు. ఒకవైపు మున్సిపల్ ఎన్నికల వేడి, మరోవైపు వరుసగా బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను సిట్ అధికారులు విచారించిన నేపథ్యంలో.. ఇప్పుడు నేరుగా పార్టీ అధినేతనే టార్గెట్ చేయడం కారు పార్టీలో తీవ్ర ఉత్కంఠను, టెన్షన్‌ను రేపుతోంది.

### కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే..

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లే..



రాజకీయ కక్షతోనే వేధింపులు

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్

2లో

## మేడారం జాతరలో పాడి కౌశిక్ రెడ్డికి అవమానం

మొక్కులు చెల్లించకుండా అడ్డుకున్న పోలీసులు

# కేసీఆర్‌కు 'సిట్' నోటీసులు!

## తెలంగాణ రాజకీయాల్లో బిగ్ ట్విస్ట్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**



తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ నిఘాపై ఆరా తీస్తున్న ప్రత్యేక విచారణ బృందం (సిట్), తాజాగా భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు నోటీసులు అందజేసింది. మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన తరుణంలో ఈ పరిణామం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గడిచిన పది రోజులుగా బీఆర్ఎస్ అగ్రనేతలను వరసగా విచారించిన సిట్ అధికారులు, గురువారం బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు సెక్షన్ 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు అందజేశారు. తేదీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుమారు 7 గంటల పాటు విచారణను ఎదుర్కొన్నారు. 27న మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ రావును కూడా అధికారులు విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. వీరితో పాటు జైలులో ఉన్న మాజీ పోలీస్ అధికారులు ప్రణీత్ రావు, రాధా కిషన్ రావు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా, ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచే వచ్చాయా అనే కోణంలో కేసీఆర్‌ను ప్రశ్నించనున్నారు.

### అందుబాటులో ఉండాలని..

సిట్ అధికారులు కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసుల్లో నేడు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని కోరారు. అయితే, ఆయన వయస్సు, ఆరోగ్య కారణాలను దృష్టిలో ఉంచుకుని, పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, ఆయన కోరుకున్న చోటే విచారిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

### 'సిట్'కు కేసీఆర్ లేఖ..

కాగా, నేడు నందినగర్ నివాసంలో మధ్యాహ్నం 3గంటలకు అందుబాటులో ఉండాలని సిట్ అధికారుల కోరగా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు నేటితో గడవు ముగియనుండడంతో.. సమయం కావాలని కేసీఆర్ సిట్ అధికారులను కోరారు. అంతేకాదు.. ఎర్రవల్లిలోని తన నివాసంలో విచారణ కొనసాగించాలని కోరారు. కాగా, కేసీఆర్ లేఖపై సిట్ అధికారులు సానుకూలంగా స్పందించి, నేటి విచారణను వాయిదా వేశారు. తదుపరి విచారణ తేదీపై ఉత్కంఠ కొనసాగుతోంది.

### వరస విచారణలతో ఉక్కిరిబిక్కిరి

ఈ కేసులో ఇప్పటికే కారు పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ సిట్ విచారించింది. 20న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును సుదీర్ఘంగా విచారించారు. 23వ

### 'కారు' పార్టీలో టెన్షన్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరుణంలో ఈ నోటీసులు రావడం బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లాల్సిన సమయంలో పార్టీ అధినేత విచారణను ఎదుర్కోవాల్సి రావడం క్యాడర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. కాగా, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. అయితే, కోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ కావడంతో ప్రభుత్వం దీన్ని చట్టపరమైన ప్రక్రియగా పేర్కొంటోంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించారనే అంశాన్ని కాంగ్రెస్ తన ప్రచార అస్త్రంగా మార్చుకుంటోంది.

### బలగాల మోహరింపు

ఒకవైపు ఆసియాలోనే అతిపెద్ద జాతర మేడారంలో సాగుతుండగా, మరోవైపు రాష్ట్ర రాజధానిలో ఈ పొలిటికల్ సెన్సేషన్ కొనసాగుతోంది. కేసీఆర్ ఫాంహౌస్ వద్ద ఇప్పటికే భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విచారణలో కేసీఆర్ ఎలాంటి సమాధానాలు ఇస్తారు? ఆ తర్వాత సిట్ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అరెస్టుల దాకా వెళ్తుందా? అనేది ఇప్పుడు అత్యంత ఉత్కంఠగా మారింది.

# కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లే..

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ జాతి పిత, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య నేత కేసీఆర్ పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుతంత్రాలు సాగిస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలం పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని హరీష్ రావు గుర్తు చేశారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యునిపై ఉమ్మివేయడమేనని వ్యాఖ్యానించారు. పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం వంటి అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకు ఎస్ఐటీ పేరుతో నోటీసులు జారీ చేయడం చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రెడ్డి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని హరీష్ రావు అన్నారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని హెచ్చరిస్తూ, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉందని, ఈ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చివరికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# సమ్మక్క, సారలమ్మకు డిప్యూటీ సీఎం భట్టి మొక్కులు

**వేద న్యూస్, మేడారం**

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సతీసమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. అశేష భక్తజనవాహిని నడుమ సమ్మక్క-సారలమ్మల గద్దెల వద్ద మొక్కులు చెల్లించి, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా జాతర ప్రాంగణం భక్తి శ్రద్ధలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు భక్తులతో కలిసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు వంటి అంశాలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# శివాలెత్తిన అరణ్యం..!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరలో అత్యంత కీలకమైన, ఉద్విగ్న భరితమైన ఘట్టం ఆవిష్కృతమైంది. కోట్లాది మంది ఆశల తల్లి, అన్యాయంపై ఎదిరించి పోరాడిన వీరవనిత సమ్మక్క తల్లి గద్దెపైకి కొలువుదీరింది. చిలుకలగుట్ట నుంచి తల్లి కుంకుమ భరిణె రూపంలో కదిలి వచ్చిన వేళ.. తాడ్వాయి అడవి ఒక్కసారిగా శివాలెత్తిపోయింది. లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో మేడారం జనారణ్యంగా మారింది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం సమ్మక్క తల్లి గురువారం రాత్రి 9.43గంటల ప్రాంతంలో గద్దెపైకి చేరింది.

### అడవి అడవంతా పూనకాలు

సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో చిలుకలగుట్టపైకి గిరిజన పూజారులు వెళ్లి మొదట రహస్య పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సమ్మక్క తల్లిని గిరిజన పూజారులు (వడ్డెలు) కుంకుమ భరిణె రూపంలో తీసుకువచ్చారు. తల్లిని గద్దెకు తీసుకువస్తున్న సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అరణ్యం మొత్తం శివాలెత్తిపోయింది. గిరిజన పూజారులు తల్లిని తీసుకువస్తున్న వేళ, డప్పు చప్పుళ్లు, కొమ్ము బూరల శబ్దాలు అడవిని ప్రతిధ్వనింపజేశాయి. ఎక్కడ ఉన్న భక్తులు అక్కడే నిలబడి, గంభీరంగా మారిపోయి పూనకాలతో ఆ తల్లిని ఆహ్వానించారు. లక్షలాది మంది భక్తుల కళ్లన్నీ ఎర్రబడ్డాయి. మనసంతా ఉద్విగ్నంగా మారిపోయింది. శరీరం మొత్తం తెలియని ఆధ్యాత్మిక తన్మయత్వంతో కదిలిపోయింది. వేలాది మంది శివసత్తుల ఊగులాటలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య తల్లి గద్దెపై ప్రతిష్ఠితమైంది. జిల్లా ఎస్పీ నేతృత్వంలో గాలిలోకి కాల్పులు జరిపి తల్లికి అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికారు.

### ఒకే చోట వనదేవతలు

బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు చేరగా.. గురువారం అర్ధరాత్రి సమ్మక్క రాకతో గిరిజన దేవతలందరూ ఒకే చోట కొలువుదీరినట్లయింది. దీంతో గద్దెల ప్రాంగణాలు లక్షలాది మంది భక్తులతో నిండిపోయాయి. ఎటు చూసినా జనసంద్రమే కనిపిస్తోంది. భక్తులు తమ తూకమెత్తు బెల్లాన్ని (బంగారం) తల్లులకు మొక్కలుగా సమర్పించుకుంటున్నారు.

### కిక్కిరిసిన జంపన్నవాగు..

జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులతో వాగు పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వాగులో స్నానాలు ఆచరించి, తడి బట్టలతోనే తల్లుల దర్శనం కోసం కిలోమీటర్ల మేర క్యూ లైన్లలో నిరీక్షిస్తున్నారు. సమ్మక్క సారలమ్మ ఒకేచోట చేరడంతో జంపన్నవాగు పరిసరాలు సైతం పూనకాలతో ఊగిపోయింది.. భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

### ప్రముఖుల రాక..

వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్ర స్థాయి ప్రముఖులు భారీగా తరలివచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబంతో మేడారం చేరుకుని, తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మలను కోరుకున్నట్లు ఆయన తెలిపారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం తల్లులను దర్శించుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క క్షేత్రస్థాయిలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంత్రి సీతక్క స్వయంగా గిరిజన వేషధారణలో భక్తుల మధ్య తిరుగుతూ వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. కలెక్టర్, ఎస్పీ ఎప్పటికప్పుడు రద్దీని సమీక్షిస్తూ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### నిఘా నీడలో జాతర

భారీ జనసందోహం నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం అత్యంత ఆధునిక సాంకేతికతను వాడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఏ ప్రాంతంలో జనం ఎక్కువగా ఉన్నారో గుర్తించి వెంటనే అక్కడ పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. వందలాది డ్రోన్ల ద్వారా అడవి లోపలి ప్రాంతాలను, రహదారులను పర్యవేక్షిస్తున్నారు. మేడారం వైపు వచ్చే అన్ని రహదారులు వాహనాలతో నిండిపోయాయి. గజ్వేల్ నుంచి ములుగు వరకు, వరంగల్ నుంచి ఏటూరునాగారం వరకు దారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి.

### రెండ్రోజుల పాటు మొక్కులు..

సమ్మక్క, సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో జాతరలో అసలైన ఘట్టం మొదలైంది. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం సాయంత్రం దేవతలు తిరిగి వన ప్రవేశం చేయడంతో ఈ మహా జాతర అధికారికంగా ముగుస్తుంది. అప్పటివరకు ఈ ఆధ్యాత్మిక కోలాహలం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది. దేవతల వనప్రవేశం జరిగినా.. భక్తులు మాత్రం ఇంకా మొక్కులు చెల్లించుకుంటూనే ఉంటారు.

# పుర పోరు.. టికెట్ల హోరు..

**వేద న్యూస్, మెదక్**



> ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ
> నామినేషన్లు ప్రారంభం కావడంతో రాజకీయ వేడి
> టికెట్ల ప్రకటనపై పార్టీల్లో జాప్యం
> స్వతంత్రులుగా బరిలో దిగే యోచన

మున్సిపల్ ఎన్నికల ప్రకటన వెలువడటంతో పాటు నామినేషన్ల దాఖలు ప్రారంభం కావడంతో పట్టణాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. అయితే, నేతలు, ఆశావహుల్లో మాత్రం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల దాఖలుకు ఇంకా రెండు రోజుల గడువు మాత్రమే ఉండటంతో ఏ పార్టీ తరఫున బరిలోకి దిగాలన్న సందిగ్ధతలో పలువురు ఉన్నారు. ఈ నేపథ్యంలో కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నారు. మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట పట్టణాల్లో పురపోరు నేపథ్యంలో రాజకీయ పార్టీలు వార్డుల వారీగా అభ్యర్థుల జాబితాను ప్రకటించాల్సి ఉంది. అయితే, ఆయా పార్టీల్లో నెలకొన్న అంతర్గత పరిస్థితుల కారణంగా టికెట్ల ప్రకటనలో జాప్యం జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### పోటీకి ప్రధాన కారణం..

రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల ద్వారా ఆర్థికంగా బలపడిన పలువురు వార్డు స్థానాలకు పోటీ చేసేందుకు ముందుకొస్తుండటంతో పార్టీల్లో పోటీ తీవ్రంగా మారింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మరో మూడేళ్ల పాటు అధికారంలో ఉండే అవకాశముండటం, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులే ఎక్కువ స్థానాల్లో గెలుపొందడం ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇతర పార్టీల నేతలు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

### వేచి చూసే ధోరణిలో బీఆర్ఎస్-బీజేపీ

కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ ఉండటంతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లో టికెట్ దక్కని ఆశావహులను తమ పార్టీలోకి ఆహ్వానించి బీ-ఫారమ్‌లు ఇవ్వడానికి రెండు పార్టీలు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ మేరకు ఆయా పురపాలికల్లో రాజకీయ సమీకరణాలపై ఇరు పార్టీల నేతలు కసరత్తు చేస్తున్నారు. కొన్ని వార్డుల్లో బలమైన అభ్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తుండగా, అభ్యర్థుల పేర్లు ముందుగానే ప్రకటిస్తే గందరగోళం తలెత్తే అవకాశం ఉందన్న కారణంతో పార్టీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. అభ్యర్థుల జాబితా విడుదల కంటే నేరుగా మున్సిపల్ కమిషనర్లకు ఏ, బీ ఫారమ్‌లను సమర్పించే యోచనలో ఉన్నట్లు సమాచారం.

### ఉపసంహరణ గడువు కీలకం

అభ్యర్థి పేరు దాదాపు ఖరారైన చోట రెబెల్‌గా నామినేషన్ వేసిన వారిని సముదాయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఉపసంహరణ గడువు వచ్చే నెల 3వ తేదీతో ముగియనుంది.

ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు రాజకీయ పార్టీలు మున్సిపల్ కార్యాలయాల్లో ఏ, బీ ఫారమ్‌లను సమర్పించాల్సి ఉంటుంది. అప్పటి వరకు పురపోరులో రాజకీయ ఉత్కంఠ కొనసాగనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మామునూరు విమానాశ్రయానికి పునర్జన్మ

## 300 ఎకరాల భూమి అప్పగింతతో కీలక ముందడుగు

**వేద న్యూస్, వరంగల్**

మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు 300 ఎకరాల భూమిని కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం తెలంగాణ విమానయాన చరిత్రలో కీలక ఘట్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ నిర్ణయంతో వరంగల్ ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించనుందని పేర్కొన్నారు.1930లో నిజాం పాలన కాలంలో నిర్మితమైన మామునూరు విమానాశ్రయం ఒకప్పుడు దక్షిణ భారతదేశంలోనే ప్రముఖంగా ఉండేదని గుర్తు చేశారు. కాలక్రమేణా నిర్లక్ష్యానికి గురైన ఈ విమానాశ్రయానికి తిరిగి ప్రాణం పోసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి, ₹300 కోట్లతో అవసరమైన భూమిని సమకూర్చినట్లు వెల్లడించారు.ఈ విమానాశ్రయం పునరుద్ధరణతో వరంగల్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాలకు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి ఊపందుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# మేడారం జాతరలో పాడి కౌశిక్ రెడ్డికి అవమానం

**వేద న్యూస్, కరీంనగర్**



తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి అవమానకర ఘటన చోటుచేసుకుంది.

> మొక్కులు చెల్లించకుండా అడ్డుకున్న పోలీసులు
> పోలీసులతో వాగ్వాదం.. బలవంతంగా తరలింపు

కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు మేడారానికి వచ్చిన ఎమ్మెల్యేను పోలీసులు గద్దెల సమీపంలో అడ్డుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనను ఎందుకు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించినప్పటికీ పోలీసులు సరైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ కౌశిక్ రెడ్డి అక్కడే వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆయనను చుట్టుముట్టి బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. మొక్కులు చెల్లించే అవకాశం ఇవ్వకుండా కారులో ఎక్కించి కరీంనగర్‌కు తీసుకెళ్లారు. జాతర వంటి పవిత్ర సందర్భంలో ప్రజాప్రతినిధిపై ఇలాంటి ప్రవర్తన తగదని భక్తులు, పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారం నుంచి తరలించిన అనంతరం కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఆయనతో పాటు భార్య, కూతురు, పార్టీ కార్యకర్తలు కూడా నిరసనలో పాల్గొన్నారు. కుటుంబంతో కలిసి జాతరకు వచ్చిన తనను నిర్బంధించడం ఏమిటని ప్రశ్నిస్తూ పోలీసుల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఈ నిరసనతో వీణవంక మండల కేంద్రంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. జాతర సమయంలో భక్తుల హక్కులు, ప్రజాప్రతినిధుల గౌరవం దెబ్బతిన్నాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మేడారం జాతరలో చోటుచేసుకున్న ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 30, 2026

# కౌన్సిలర్‌గా నామినేషన్ దాఖలు చేసిన శంకర్

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకుడు కుమ్మరి శంకర్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వార్డులో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నామినేషన్ ప్రక్రియ అనంతరం ప్రారంభమైన ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్న కుమ్మరి శంకర్, వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని భరోసా ఇస్తున్నారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. మంచితనానికి మారు పేరుగా నిలిచే శంకర్, సౌమ్య స్వభావంతో పార్టీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ప్రశ్నించే గొంతుకగా ప్రజల పక్షాన నిలబడుతూ వచ్చిన ఆయనకు అన్ని వర్గాల నుంచి విశేషమైన ఆదరణ, అభిమానం ఉంది. ముఖ్యంగా యువతరం మొత్తం ఆయన నాయకత్వాన్ని కోరుకుంటుండటంతో 20వ వార్డు ఈ ఎన్నికల్లో ప్రత్యేక



ఆకర్షణగా మారింది. వార్డులోని అన్ని వర్గాల ప్రజలు కుమ్మరి శంకర్‌కు మద్దతు ప్రకటిస్తూ విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గమనిస్తే, ఆయనకు విజయావకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రజల ఆశీస్సులతో 20వ వార్డు అభివృద్ధికి కొత్త దిశ చూపుతానన్న విశ్వాసంతో కుమ్మరి శంకర్ ఎన్నికల ప్రచారంలో ముందంజలో కొనసాగుతున్నారు.

# సజావుగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా, రిజర్వేషన్ వివరాలు, నో డ్యూ సర్టిఫికెట్, హెల్ప్‌డెస్క్ తదితర ఏర్పాట్లను పరిశీలించి, నామినేషన్ల స్వీకరణ పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని, కేంద్రం పరిధిలో 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలోని 39 వార్డులకు సంబంధించి 13 మంది ఆర్‌ఓలు, 13 మంది ఏఆర్‌ఓలను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తయిందని, అభ్యర్థులు అవసరమైన పత్రాలతో పాటు ఎన్నికల డిపాజిట్ చెల్లించాలని సూచించారు. జనరల్ అభ్యర్థులకు డిపాజిట్ రూ. 2,500 కాగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రూ. 1,250గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థకు ఉత్పత్తితో పాటు

- కార్మికుల సంక్షేమం ముఖ్యం
- ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ
- ఫిజియోథెరపీ కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, మందమర్రి:**

సింగరేణి సంస్థకు ఉత్పత్తితో పాటు కార్మికుల సంక్షేమం కూడా ముఖ్యమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. గురువారం కేకే-1 డిస్పెన్సరీ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న కార్మికులు, రిటైర్డ్ కార్మికులు ఈ ఫిజియోథెరపీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కీళ్ల సమస్యల్లో ఎక్కువ భాగం వ్యాయామాలు, ఫిజియోథెరపీ ద్వారా నివారించవచ్చని తెలిపారు. గతంలో ప్రజలు శారీరకంగా ఎక్కువ కష్టపడేవారని, ఆధునిక జీవన విధానంలో శారీరక శ్రమ తగ్గడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అందుకే రోజువారీ జీవనంలో మార్నింగ్ వాక్, వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి ఈ ఫిజియోథెరపీ కేంద్రంలో మరిన్ని పరికరాలు ఏర్పాటు చేసి ఆధునికీకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గుర్తింపు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి సులేంద్ర సత్యనారాయణ




మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అందిస్తున్న వైద్య సేవలను కార్మికులు పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే కేకే-1 డిస్పెన్సరీలో హెచ్‌బీ ఏ1సి, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించాలని కోరారు. డివైసీ ఎంఓ డాక్టర్ మధుకుమార్ మాట్లాడుతూ, ఫిజియోథెరపీ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, ఈ కేంద్రాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జీఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. నాగేశ్వరరావు, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు రమణ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘మానేరు’లో ఇసుక దొంగలు!

- అధికారులకు కనిపించని అక్రమ తవ్వకాలు
- రహస్యంగా మారిన ఇసుక దందా..
- సామాన్యులపై అధిక రేట్లతో దోపిడీ
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**వేద న్యూస్, గంభీరావుపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని మానేరు వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం ఎనిమిది గంటలకే కొందరు దుండగులు వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యాలు స్థానికులకు కనిపిస్తున్నాయి. ఈ వ్యవహారం బహిరంగ రహస్యంగానే ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులకు మాత్రం కనిపించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలపై అధికారులు కఠిన చర్యలు చేపట్టకపోవడం వల్ల ఒకరిని చూసి మరొకరు ఈ దందాలోకి దిగుతూ ఇసుక అక్రమ రవాణాను కాసులు సంపాదించే వనరుగా మార్చుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సహజ వనరుల దోపిడీని అరికట్టేందుకు ఏ అధికారులు



ముందుకు రావాలో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను సామాన్య ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తూ దోచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో అధికారులు పలువురిని పట్టుకొని కేసులు నమోదు చేసినప్పటికీ, అక్రమ ఇసుక దందా మాత్రం ఆగడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే మానేరు వాగు పూర్తిగా దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# కేటీఆర్ వాహనం తనిఖీ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాహనాన్ని ఎన్నికల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనానికి సంబంధించిన పత్రాలు, అనుమతులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎన్నికల అధికారులకు పూర్తిగా సహకరిస్తూ తనిఖీలకు అనుమతి ఇచ్చారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## బాధిత నిరుపేద కుటుంబానికి ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సహాయం

**వేద న్యూస్, రుద్రూర్:**



బాన్సువాడ నియోజకవర్గం రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ సభ్యురాలు చందా బుధవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం స్థానిక బీజేపీ నాయకుల ద్వారా తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు, ఎన్‌ఆర్‌ఐ కోనేరు శశాంక్ వెంటనే స్పందించారు. తన వంతు ఆర్థిక సహాయంగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000లను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరు ప్రశాంత్ గౌడ్, బాన్సువాడ బీజేపీ సీనియర్ నాయకులు కటిక రామరాజు, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు భోజిగొండ అనిల్, రేపల్లె సాయి ప్రసాద్, అంబం గ్రామ సర్పంచ్ కుర్లెపు గంగాధర్, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ నుంచి శ్రీశైలం వరకు శివస్వాముల పాదయాత్ర

**వేద న్యూస్, రుద్రూర్:**



బోధన్ పట్టణంలోని శివాలయం నుంచి వీరేశం స్వామి, సాయిలు స్వామి, రామేశ్వరరావు అనే ముగ్గురు శివదీక్ష మాలధారణ స్వాములు గురువారం కాలి నడకన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము స్వాములకు ఘనంగా స్వాగతం పలికారు. పండ్లు, పాలు సేవగా అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పత్తి నవీన్, అడప నవీన్, అక్కపల్లి నాగేందర్, ఇమ్రాన్, మంగళి సంతోష్, ఈర్వ అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ భవనం కోసం భూమి విరాళం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో మహిళా సంఘాల సమావేశాల కోసం భవనం లేకపోవడంతో, గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం మరియు మహిళా సంఘాల సభ్యుల అభ్యర్థన మేరకు స్వర్గీయ కట్ట సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యులు మహిళా సంఘ భవనం నిర్మాణం కోసం రెండు గుంటల భూమిని విరాళంగా అందజేశారు. స్వర్గీయ కట్ట సత్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు సంపూర్ణ, కట్ట సౌమ్య శ్రీకాంత్ రెడ్డి, రుత్విక్ రెడ్డి గ్రామ పంచాయతీకి మహిళా సంఘ భవనం కోసం రెండు గుంటల భూమిని అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ నేరెళ్ళ విజయ్ మాట్లాడుతూ, మహిళా సంఘాల అభివృద్ధికి భూమిని విరాళంగా అందించడం అభినందనీయమని కొనియా



డారు. భూమిని విరాళంగా అందించిన కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపసర్పంచ్ వంశీ, నరేందర్, సులోచన, రుచిత, కళ, వెన్నెల, అశోక్, శేఖర్, మధు, నాగరాజు తదితరులు పాల్గొనగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వృథాగా పోతున్న తాగునీరు..

- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**వేద న్యూస్, మడికొండ:**

నిత్యం గుక్కెడు తాగునీటి కోసం గ్రేటర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ పూటకు ఆ పూట నీటిని తెచ్చుకుంటూ జీవనం గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలో అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మడికొండ ఖండాల దాబా సుచి హోటల్ ఎదురుగా ఉన్న పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు లీక్ అవుతోంది. దీంతో లీటర్లకు లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చీమ కుట్టినట్టైనా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కొరతతో నిత్యం అల్లాడుతుంటే, మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో విలువైన మంచినీరు




వృథాగా పోతుండటం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఈ పరిస్థితికి బాధ్యులైన అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మత ంలు చేసి, తాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను సరిచేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వేద న్యూస్
శుక్రవారం జనవరి 30, 2026

# నేటి నుంచి తుంబురేశ్వర స్వామి ఉత్సవాలు

**– మొదటి రోజు బండ్లు–బోనాలు**

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన శ్రీ తుంబురేశ్వర స్వామి దేవాలయంలో నేటి నుంచి ఫిబ్రవరి 1 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వైద్య రవి కోటి రామశర్మ తెలిపారు. శ్రీ మదనానంద స్వామి దివ్య ఆశీస్సులతో ఉత్సవాలు వైభవంగా జరుగనున్నట్లు చెప్పారు. 30వ తేదీ మాఘ శుద్ధ ద్వాదశి రోజున ఉదయం రుద్రాభిషేకం, కలశస్థాపన, శకటోత్సవం నిర్వహించగా, సాయంత్రం బండ్లు–బోనాలు జరుగుతాయి. 31వ తేదీన రుద్రాభిషేకం, పుష్పార్చన, పచ్చి బండ్లు, రాత్రి పల్లకీ సేవ, రథోత్సవం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1న మాఘ శుద్ధ పౌర్ణమి రోజున పార్వతి–పరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్య అన్నదానం, భజన–సంకీర్తనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఆత్మానంద ఆశ్రమం రుస్తుం పేట పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామి, శ్రీ రాజయోగి వెంకటస్వామి విచ్చేయనున్నట్లు ఆలయ కమిటీ, గ్రామ పాలకవర్గ సభ్యులు తెలిపారు.

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల పనితీరుపై పర్యవేక్షణ
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భ్రూణహత్యలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పీసీఎన్డీటీ చట్టం అమలుపై జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశాలు తరచుగా నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన పరిణామాలపై ప్రైవేట్ ఆసుపత్రుల రేడియాలజిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో నూతన ప్రైవేట్ ఆసుపత్రులకు నిబంధనల ప్రకారమే అనుమతులు జారీ చేయాలని, మున్సిపల్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో నవజాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిశిశు ఆరోగ్యంపై వైద్యులు, ఆశా, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల జననాల మధ్య తగిన వ్యవధి ఉండేలా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సీజేరియన్ ఆపరేషన్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

**– విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి – ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**వేద న్యూస్, కారేపల్లి:**



తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో (మోడల్ స్కూల్స్) 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఇంగ్లీష్ మీడియం విద్యను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మోడల్ స్కూల్స్ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ తరగతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనవరి 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రారంభం అవుతాయి. ఫిబ్రవరి 28న చివరి తేదీ. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 19న నిర్వహిస్తారు. 6వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 7 నుంచి 10వ తరగతుల్లో ఖాళీ సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని మీ సేవా కేంద్రాల ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ tgms.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.

# సింగరేణి ఉత్తమ అధికారి వెంకటేష్‌కు సన్మానం



**వేద న్యూస్, కాసిపేట:**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి స్థాయిలో ఉత్తమ అధికారిగా ఎంపికైన కాసిపేట గనిలో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ నీ గని ఉద్యోగులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాసిపేట గని విస్తరణ పనులు వేగవంతం చేయడం, సాండ్ స్టోవ్వింగ్ కార్యక్రమాల సమర్థ నిర్వహణ, 1ూా టన్నెల్‌లో కొత్త మ్యాన్ రైడింగ్ సదుపాయం ఏర్పాటు, అలాగే గని ఉత్పత్తి పెంపులో విశేష కృషి చేసినందుకు ఆయనకు ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మన్ దాస్, కన్నయ్య, టీబీజీక్స్ నాయకులు బైరి శంకర్, రమేష్, పిట్ కమిటీ, సేఫ్టీ కమిటీ సభ్యులు వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొని అభినందనలు తెలిపారు. అనంతరం గని ఏజెంట్ రాంబాబు, మేనేజర్ సతీష్, రక్షణ అధికారి నిఖిల్, అండర్ మేనేజర్లు, సంక్షేమ అధికారి మీర్జా, సర్వేయర్ ప్రభాకర్, ఖాన్ తదితర అధికారులు వెంకటేష్ నీ సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గనిలో చేపట్టిన అభివృద్ధి పనులు సమయానికి పూర్తి కావడం సహచరుల సహకారంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, సంతోష్, పిట్టల శివ, శ్రీకాంత్, రాజన్, అబ్దుల్ రంజిత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పోస్టర్ ఆవిష్కరణ

**– జిల్లావ్యాప్తంగా రోడ్డు భద్రత మాస ఉత్సవాలు**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి 1 నుంచి 29 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాస ఉత్సవాలు జిల్లాలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజున జిల్లా కలెక్టర్, ఎస్పీ చేత రోడ్డు భద్రత పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలు, పాఠశాలలు, కళాశాలలు, కూడళ్లలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేములవాడ, సిరిసిల్ల, ఇల్లంతకుంట తదితర ప్రాంతాల్లో ర్యాలీలు, క్విజ్‌లు, వ్యాసరచన పోటీలు, రంగోలీ కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించగా, అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకున్నారు. నో హెల్మెట్–నో పెట్రోల్ కార్యక్రమాన్ని పెట్రోల్ బంకుల వద్ద అమలు చేశారు. బస్టాండ్లు, సిగ్నల్ పాయింట్లు, ఆర్టీసీ డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. మాసాంతంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో భారీ అవగాహన కార్యక్రమం, ఆటో ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్టీఏ మెంబర్లు, జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, పాఠశాల విద్యార్థులు, డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన డీసీసీ చైర్మన్, ఈవీ శ్రీనివాస్

**వేద న్యూస్, హనుమకొండ:**



పరకాల మున్సిపాలిటీ వార్డు సభ్యుల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఫామ్–బీ జారీ చేసే అధికార ప్రతినిధిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని నియమించినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి స్నేహ శబరీష్ కు అధికారికంగా తెలియజేశారు. ఈ సందర్భంగా డీసీసీ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలసి సంబంధిత ఫామ్–ఏతో పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 244 బూత్ లెవెల్ ఏజెంట్ల ఫారమ్‌లను సమర్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

# ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ తనిఖీ

**– సంకేపల్లి వద్ద రిజిస్టర్లు పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు**

**వేద న్యూస్, వేములవాడ:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పరిధిలోని సంకేపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్‌ను జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వద్ద ఉన్న వివిధ రిజిస్టర్లను పరిశీలించి, నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో నోడల్ అధికారులు గీత, నవీన్ కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# 'సమ్మక్క-సారలమ్మ' దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కే–1ఏ పాలవాగు సమీపంలో వెలసిన సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్ద రాజు దేవతలను గురువారం మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి దీవెనలు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి బిడ్డపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే పట్టణ అభివృద్ధి మరింత వేగంగా జరగాలని దేవతలను ప్రార్థించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో శుభ్రత, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మున్సిపల్ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతలను దర్శించుకున్న మంత్రి పొన్నం

**వేద న్యూస్, శంకరపట్నం:**




మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని, శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నిలువెత్తు బంగారాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బసవయ్య గౌడ్ (మాజీ), జెడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, సమ్మక్కసారలమ్మ జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ గుర్రం స్వామితో పాటు కాంగ్రెస్ నాయకులు గట్టు తిరుపతి గౌడ్, మమ్మద్ షారుక్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆఫీస్ల కోసం భూమి పరిశీలన

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి రైతు వేదిక పక్కన ఉన్న వీర్నపల్లి గ్రామపంచాయతికి చెందిన భూమిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి తహసీల్దార్ ముక్తార్ పాషా మాట్లాడుతూ.. ఎమ్మార్వో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణం కోసం సుమారు 20 గుంటల భూమిని పరిశీలించినట్లు తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, నివేదిక ఆమోదం అనంతరం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీర్నపల్లి గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్నఅరుణ్ కుమార్, ఉపసర్పంచ్ నరేష్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంపీడీవో శ్రీలేఖ, ఏఎంసీ వైస్ చైర్మన్ లేంకల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ పాటి దినకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేద న్యూస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో వేద న్యూస్ తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీవో శ్రీలేఖ గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వేద న్యూస్ నిర్వాహకులను అభినందిం చారు. ప్రజలకు నిజమైన, నమ్మదగిన సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వేద న్యూస్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా వేద న్యూస్ ఇదే విధంగా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల నియోజకవర్గం వేద న్యూస్ రిపోర్టర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మకు ప్రత్యేక పూజలు

**- మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మక్క-సారలమ్మ జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే తన ఎత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ.. సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉట్కూరు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ మామిడి రాజు, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఈదుల రవీందర్ రెడ్డి, ఈదుల రాజిరెడ్డి, వజ్జాపెల్లి మల్లేశం, దెయ్యాల కనకయ్య, రామకృష్ణ, మామిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవం



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో నేడు తృతీయ వార్షికోత్సవ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మాఘ మాస శుద్ధ ద్వాదశి శుక్రవారం సందర్భంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నట్లు గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యవచనం, మంత్రసూక్త సహిత రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించనున్నారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణతో పాటు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు హిందూ ధర్మ సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తాయని సర్పంచ్ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

# లాల్ సింగ్ నాయక్ తండా అభివృద్ధిపై చర్చ



**వేద న్యూస్, వీర్నపల్లి:**

వీర్నపల్లి మండలంలోని లాల్ సింగ్ నాయక్ తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ గ్రామసభకు గ్రామ సర్పంచ్ అధ్యక్షత వహించారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనుల అమలుపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రహదారుల అభివృద్ధి, మురుగు కాలువల శుభ్రత, తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు వంటి అంశాలపై చర్చించారు. గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ అభివృద్ధికి అందరూ సమిష్టిగా సహకరించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సేవే ధ్యేయం

**- 19 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రాయబారపు సురేష్ నామినేషన్**




**వేద న్యూస్ జమ్మికుంట :**

జమ్మికుంట పట్టణ 19 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రాయబారపు సురేష్ గురువారం మున్సిపల్ ఆఫీసులో నామినేషన్ దాఖలు చేశారు. ప్రజలే తన బలమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. 19వ వార్డు ప్రజల ఆశీ ర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నా నని, తనను ఆదరించి.. నిండు మనసుతో ఆశీ ర్వదించాలని ప్రజలను కోరారు.న్యాయం కోసం, ధర్మాన్ని నిలబెట్టేందుకు తాను బరిలో.. నిలిచి ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తన ను ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా సేవ చేస్తూ.. వార్డు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉండటం జరుగుతు న్నదని తెలిపారు.

# ఎర్రమట్టికి బదులు మొరం!

- తూతూ మంత్రంగా డివైడర్ పనులు
- చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారుల డిమాండ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కొదురుపాక చౌరస్తా నుంచి నర్సింగాపూర్ స్టేజ్ వరకు వేములవాడ-కరీంనగర్ హైవేపై చేపట్టిన నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయి. అయితే రహదారి డివైడర్ పనుల విషయంలో కాంట్రాక్టర్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంకట్రావుపల్లి నుంచి నర్సింగాపూర్ స్టేజ్ వరకు రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగగా, డివైడర్ నిర్మాణం పూర్తయింది. కానీ డివైడర్ మధ్యలో నిబంధనల ప్రకారం ఎర్ర మట్టి వేయాల్సి ఉండగా, దానికి బదులు మొరం, రాళ్లతో కూడిన మట్టిని పోసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. డివైడర్ మధ్యలో మొరంకుప్పలు వేసిన పరిస్థితుల్లో మొక్కలు ఎలా నాటుతారు? నాటిన మొక్కలు ఎంతకాలం బతుకుతాయి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం నాటిన మొక్కలకు ఉదయం వేసిన నీరు సాయంత్రానికి కూడా నిలవని పరిస్థితి నెలకొందని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మొరం పోసి చేతులు దులుపుకోవాలని కాంట్రాక్టర్ భావిస్తున్నాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఆర్ అండ్ బీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించకపోవడం గమనార్హమని స్థానికులు విమర్శిస్తున్నారు. మొరం వేసిన విషయంపై ఇప్పటివరకు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని అంటున్నారు. తక్షణమే డివైడర్ మధ్యలో ఉన్న మొరాన్ని తొలగించి, నిబంధనల ప్రకారం ఎర్ర మట్టిని నింపాలని వాహనదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 8 మంది జూదరుల అరెస్ట్

**- నగదు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**వేద న్యూస్, పెద్ద శంక్రపేట:**

మెదక్ జిల్లా శంకరంపేట్ (ఏ) మండలం పరిధిలోని మైసమ్మ గుడి వద్ద జూదం ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించి 8మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ దాడి చేపట్టినట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ సీఐ ఆధ్వర్యంలో మైసమ్మ గుడి సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న వ్యక్తులపై దాడి చేశారు. ఈ దాడిలో 8మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.46,852 నగదు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారు బాసరం కృష్ణ, హట్కారి బాజీరావు, కాంచరీ సత్యం, కలల్లి సాయగౌడ్, పెద్దపర్వాణి సంగమేష్, అవులుదగిరి లింగం, అశేల్లి యాదగిరి గా పోలీసులు గుర్తించారు. వారిని శంకరంపేట్ (ఏ) పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి చర్యల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పు మార్గాలు ఎంచుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# విద్యార్థులకు మేడారం చరిత్రపై అవగాహన

- అభినయ రూపంలో వివరణ
- సమ్మక్క-సారలమ్మ స్ఫూర్తితో రాణించాలి
- ప్రధానోపాధ్యాయులు ఎన్. రజిత



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఆసిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకుని విద్యార్థులకు వారి చరిత్ర, పోరాట గాథలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమ్మక్క-సారలమ్మ వేషధారణలో మేడారంలో జరిగే ఆదివాసీ గిరిజన జాతర చరిత్రను, ఆదివాసుల సంస్కృతిని అభినయ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్. రజిత మాట్లాడుతూ.. మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర సమ్మక్క-సారలమ్మల వీరమరణానికి చిహ్నంగా నిర్వహించబడుతుందని చెప్పారు. వారు త్యాగం, వీరత్వం, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులంతా సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో ధైర్యం, సాహసంతో జీవితంలో ముందుకు సాగి గొప్పగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, తిరులమతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే వైరా మున్సిపాలిటీ అభివృద్ధి

**- వైరా మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ రాము**



**వేద న్యూస్, కారేపల్లి:**

కాంగ్రెస్ పార్టీతోనే వైరా మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ వైరా మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ రాము అన్నారు. వైరా మున్సిపాలిటీలో ఎస్టీకి రిజర్వ్ అయిన 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గుగులోత్ రాము గురువారం తన నామినేషన్‌ను అధికారికంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైరా మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొదిల హరినాథ్, ఏదునూరి సీతారాములు, గుగులోత్ రమాదేవి, ఏడుకొండలు, భానోత్ నెహ్రూ, భూక్యా హేమ్లా, పొదిల ప్రవీణ్, సునీల్, భూక్యా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శాన్ని చాటిన కనగర్తి పాలకవర్గం



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని కనగర్తి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆదర్శాన్ని ఆచరించి శభాష్ అనిపించుకుంది. గ్రామానికి చెందిన బండి కొమురయ్య ఇటీవల అకస్మాత్తుగా మరణించిన నేపథ్యంలో వారి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు. రాబోయే రోజుల లో గ్రామంలో ఏ కుటుంబం లో వ్యక్తి చనిపోయిన కూడా ఇదేవిధంగా పాలకవర్గం తరఫున తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ , ఉపసర్పంచ్ వట్టేపెల్లి శరత్ చంద్ర, వార్డు సభ్యులు మాడుగుల శ్రీలత- రాజు,కలకోట సమ్మయ్య, అకెనపెల్లీ వెంకటేష్, రామంచ స్వప్న- చంటి , రామంచ రాకేష్, బండి రాజు, బచ్చల సుమలత - భానుచందర్ బచ్చల మౌనిక- సతీష్, దేవునూరి రాజు పాల్గొన్నారు

వేద న్యూస్
శుక్రవారం జనవరి 30, 2026

# జీఎంను సన్మానించిన రిటైర్డ్ కార్మికులు



**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి ఏరియాలోని కేకే-1 డిస్పెన్సరీలో సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికుల సౌకర్యార్థం ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, డివైసీఎంవో డాక్టర్ మధుకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. నాగేశ్వరరావులను రిటైర్డ్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం కేకే-1 డిస్పెన్సరీలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ మాట్లాడుతూ.. రిటైర్డ్ కార్మికుల కోసం ఫిజియోథెరపీ కేంద్రాన్ని మందమర్రి ఏరియాలో ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని అన్నారు. ప్రైవేట్ కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేయించుకుంటే రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చవుతుందని, తక్కువ పెన్షన్‌తో జీవించే రిటైర్డ్ కార్మికులకు సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే కేకే-1 డిస్పెన్సరీలో ఇతర రక్త పరీక్షలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కార్మికుల సంఘం సభ్యులు జక్కంపూడి రాజన్న, ఆసం కొమరన్న, సిహెచ్. గట్టయ్య, జెట్టి రవి, సి. నిగారపు కుమార్, కంబాల రాజనర్సు, దాసరి రామన్న, తులసి రామ్, పారిపల్లి రాజేశం, కేదారి, ఎండి ఖలీల్, ఆర్. హనుమంతు, పసునుర్తి నరసయ్య, పీ. రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మత్స్య గిరీంద్రుని కల్యాణ మహోత్సవం

**వేద న్యూస్, శంకరపట్నం:**

తెలంగాణ రాష్ట్రంలో మత్స్య అవతార రూపంలో ఉన్న ఏకైక మత్స్య గిరీంద్రుని దేవాలయం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో ఉంది. ఈ దేవాలయంలో గురువారం మత్స్య గిరీంద్రుని కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తగట్టు గుట్టపై జరిగిన ఈ కళ్యాణ మహోత్సవాన్ని శేషం మాధవాచార్యులు, మురళీధరాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల కరతాళ ధ్వనుల మధ్య కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. వేద పండితులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మండల



అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఉప్పుగల్ల మల్లారెడ్డి, గట్టు తిరుపతి గౌడ్, తిరుపతితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల




**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని మొత్తం 48 వార్డులకు గాను 38 వార్డుల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులు అధికారికంగా విడుదల చేశారు. అనంతరం ప్రకటించిన అభ్యర్థులకు ఎన్నికల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ, గత పదేళ్లలో మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపామని తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి పనిచేసే వారికే ఈసారి టికెట్లు కేటాయించామని, అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. మిగిలిన వార్డుల అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్త బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో గులాబీ జెండా ఎగిరేలా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహ రెడ్డి, యువనేత నల్లమోతు సిద్ధార్థ పాల్గొని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు యదవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నభిమోజు నాగార్జున చారి, నారాయణ రెడ్డి, వీరకోటి రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, కరుణాకర్ రెడ్డి, బాబయ్య, మక్డుం పాషా, ఇలియాజ్, మాజిద్, కట్టా మల్లేష్ గౌడ్, పిస్కే ప్రసాద్, బిక్షం గౌడ్, అశోక్ రెడ్డి, హతిరాం నాయక్, బాలు నాయక్, కోలా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐబొమ్మ నిర్వాహకుడు రవికి హైకోర్టు షాక్

**- బెయిల్ పిటిషన్‌పై పోలీసులకు నోటీసులు**

**వేద న్యూస్ హైదరాబాద్ :**

సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. నాంపల్లి కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ వరుసగా తిరస్కరణ ఎదురుకావడంతో తాజాగా హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. చిత్ర పరిశ్రమకు పైరసీ ద్వారా భారీ నష్టం కలిగించాడనే ఆరోపణలతో అతడిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రవీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు, ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయకూడదన్న ఉద్దేశంతో మంగళవారం కౌంటర్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు తీవ్రతను న్యాయస్థానానికి వివరించేందుకు పోలీసులు సిద్ధమ వుతున్నారు. నాలుగు కేసులు నమోదు



చిత్ర పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగేలా పైరసీ కార్యకలా పాలకు పాల్పడ్డాడనే ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులు రవిపై మొత్తం నాలుగు కేసులు నమోదు చేశారు. ప్రముఖ సినిమాలను అక్రమంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, భారీగా లాభాలు ఆర్జించాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ప్రస్తుతం రవి చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. కేసు తీవ్రత దృష్ట్యా నాంపల్లి కోర్టు ఇప్పటివరకు పలుమార్లు అతడి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. ఇప్పుడు హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తీసుకునే నిర్ణయం కీలకంగా మారింది. ఈ కేసు చిత్ర పరిశ్రమతో పాటు సైబర్ నేరాల నియంత్రణపై కూడా ప్రభావం చూపుతుందని న్యాయ, సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మాజీ మంత్రి వేముల

**వేద న్యూస్ నిజామాబాద్ :**



బీఆర్ఎస్ అధినేత కేసిఆర్‌కు సిట్ నోటీసు జారీ చేయడంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు సహించబోరని ఆయన అన్నారు. సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తన స్వగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను వేల్పూర్‌లో దగ్ధం చేశారు. ఉద్యమ నాయకుడిగా, రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లో తీవ్ర అభద్రతా భావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో కప్పిపుచ్చుకునేందు సిట్‌లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని మండిపడ్డారు.

# ప్రజలే నా బలం

**- 24 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి..**
**- కౌన్సిలర్ గా రాసమల్ల భాగ్య శేఖర్ నామినేషన్**

**వేద న్యూస్ జమ్మికుంట :**




జమ్మికుంట పట్టణ 24 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా రాస మల్ల భాగ్య శేఖర్ గురువారం మున్సిపల్ ఆఫీసులో నామినేషన్ దాఖలు చేశారు. ప్రజలే తమ బలమని ఈ సందర్భంగా భాగ్య శేఖర్ దంపతులు వెల్లడించారు. 24వ వార్డు ప్రజల ఆశీర్వాదంతో కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే సేవా కార్యక్రమాలతో పాటు వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని రాస మల్ల భాగ్య శేఖర్ దంపతులు వెల్లడిస్తున్నారు. ఒకసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే నాయకురాలిగా కాకుండా సేవకులుగా తాము చిత్తశుద్ధితో పనిచేస్తామని., ప్రజలకు స్పష్టం చేస్తూ.. వినమ్ర పూర్వకంగా ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

# సేవే లక్ష్యంగా అడుగులు

**- 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా వంశీ నామినేషన్**

**వేద న్యూస్, జమ్మికుంట:**




సేవే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్టు జమ్మికుంట పట్టణ 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, జర్నలిస్ట్ కండెం వంశీ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గా మున్సిపల్ ఆఫీసులో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఒక జర్నలిస్టు గా ప్రజా సమస్యలపై తనకు అవగాహన ఉందని ,23వ వార్డు ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తే... ప్రజల పక్షాన పని చేస్తానని వెల్లడించారు. సేవా దృక్పథమే ప్రధాన అంశమని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే చక్కటి నాయకులను జనం ఎన్నుకుంటారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. 23వ వార్డు ప్రజలకి సేవకుడిగా అందుబాటులో ఉంటానని, ప్రజాసేవ చేయడంలోనే పూర్తి సమయం కేటాయిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు తనను దీవిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారతీయ వార్తాపత్రికల దినోత్సవం

## ప్రజాస్వామ్యానికి అక్షరాల బలం

**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 29న భారతీయ వార్తాపత్రికల దినోత్సవాన్ని ఘనంగా గుర్తు చేసుకుంటారు. 1780 జనవరి 29న భారతదేశంలో తొలి వార్తాపత్రికగా గుర్తింపు పొందిన హిక్కీస్ బెంగాల్ గెజెట్ ప్రారంభమైన ఈ చారిత్రక సందర్భమే ఈ దినోత్సవానికి పునాది. అప్పటి కాలంలో సమాచారానికి పరిమిత మార్గాలే ఉన్న పరిస్థితుల్లో, ప్రజల ఆలోచనలకు అక్షరరూపం ఇచ్చిన ఈ తొలి ప్రయత్నం భారతీయ జర్నలిజం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ రోజు కేవలం ఒక పత్రిక ఆవిర్భావాన్ని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసిన జర్నలిజం ప్రయాణాన్ని గుర్తు చేసే సందర్భంగా నిలుస్తోంది.

బ్రిటిష్ పాలన కాలంలో ప్రారంభమైన భారతీయ జర్నలిజం, మొదటి అడుగుల నుంచే అధికారాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ప్రదర్శించింది. సామాన్య ప్రజల సమస్యలు, పాలకుల అన్యాయాలు, సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో వార్తాపత్రికలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో పత్రిక అంటే కేవలం వార్తల సమాహారం కాదు; అది ప్రజల స్వరానికి ప్రతిబింబం. అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా, ఆలోచనల మార్పుకు వేదికగా పత్రికలు ఎదిగాయి. ఈ క్రమంలో జర్నలిజం ఒక వృత్తిగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా మారింది.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వార్తాపత్రికల పాత్ర మరింత ప్రభావవంతంగా కనిపించింది. జాతీయ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న నాయకుల ఆలోచనలను ఇంటింటికీ చేర్చడం, బ్రిటిష్ పాలనలోని అక్రమాలను బహిర్గతం చేయడం వంటి కీలక బాధ్యతలను పత్రికలు నిర్వర్తించాయి. అనేక పత్రికలు నిషేధాలు, ఆంక్షలు, కేసులు ఎదుర్కొన్నప్పటికీ, సత్యాన్ని వదలలేదు. ఆ కాలంలో పత్రిక చదవడం అంటే స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామిగా మారడమేనని భావించిన రోజులు ఉన్నాయి.

ప్రజాస్వామ్యంలో జర్నలిజాన్ని నాలుగో స్థంభంగా పరిగణిస్తారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు మీడియా కూడా ప్రజల పక్షాన నిలబడి అధికారాన్ని జవాబుదారీగా ఉంచాల్సిన బాధ్యత వహిస్తుంది. ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడం, సమాజంలో చర్చకు దారి తీయడం వంటి అంశాల్లో వార్తాపత్రికల పాత్ర అపారమైనది. నిజాయితీగా, నిష్పక్షపాతంగా వెలువడే ప్రతి వార్త ప్రజాస్వామ్య బలాన్ని మరింత పెంచుతుంది.

డిజిటల్ యుగంలో సమాచార ప్రవాహం వేగవంతమైనప్పటికీ, జర్నలిజం ముందున్న సవాళ్లు కూడా అంతే తీవ్రంగా మారాయి. నకిలీ వార్తలు, వాణిజ్య ఒత్తిళ్లు, విశ్వసనీయతపై ప్రశ్నలు మీడియాను పరీక్షిస్తున్నాయి. అయినప్పటికీ, సత్యం, నైతికత, ప్రజాహితం అనే మూలసూత్రాలను వదలకుండా నిలబడినప్పుడే జర్నలిజం తన అసలైన పాత్రను పోషించగలదు. భారతీయ వార్తాపత్రికల దినోత్సవం సందర్భంగా ఈ విలువలను మరోసారి గుర్తు చేసుకోవడం అత్యంత అవసరం. సత్యాన్ని నిర్భయంగా చెప్పే అక్షరాలే సమాజానికి దారి చూపుతాయి, ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తాయి.బ్రిటిష్ పాలన కాలంలో ప్రారంభమైన భారతీయ జర్నలిజం, మొదటి అడుగుల నుంచే అధికారాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ప్రదర్శించింది. సామాన్య ప్రజల సమస్యలు, పాలకుల అన్యాయాలు, సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో వార్తాపత్రికలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో పత్రిక అంటే కేవలం వార్తల సమాహారం కాదు; అది ప్రజల స్వరానికి ప్రతిబింబం. అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా, ఆలోచనల మార్పుకు వేదికగా పత్రికలు ఎదిగాయి. ఈ క్రమంలో జర్నలిజం ఒక వృత్తిగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా మారింది.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వార్తాపత్రికల పాత్ర మరింత ప్రభావవంతంగా కనిపించింది. జాతీయ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న నాయకుల ఆలోచనలను ఇంటింటికీ చేర్చడం, బ్రిటిష్ పాలనలోని అక్రమాలను బహిర్గతం చేయడం వంటి కీలక బాధ్యతలను పత్రికలు నిర్వర్తించాయి. అనేక పత్రికలు నిషేధాలు, ఆంక్షలు, కేసులు ఎదుర్కొన్నప్పటికీ, సత్యాన్ని వదలలేదు. ఆ కాలంలో పత్రిక చదవడం అంటే స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామిగా మారడమేనని భావించిన రోజులు ఉన్నాయి.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో వార్తాపత్రికల పాత్ర మరింత ప్రభావవంతంగా కనిపించింది. జాతీయ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి పత్రికలు నిర్వర్తించాయి. అనేక పత్రికలు నిషేధాలు, ఆంక్షలు, కేసులు ఎదుర్కొన్నప్పటికీ, సత్యాన్ని వదలలేదు. ఆ కాలంలో పత్రిక చదవడం అంటే స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామిగా మారడమేనని భావించిన రోజులు ఉన్నాయి.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 30, 2026

# గోడౌన్ల అగ్నిప్రమాదం ఘటనలో 21కు చేరిన మృతులు..



**వేద న్యూస్ కోల్‌కతా :**

గోడౌన్లలో జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో మరణించిన వారి సంఖ్య 21కు చేరింది. మరో 28 మంది అదృశ్యమయ్యారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరుగవచ్చని పోలీస్ అధికారి తెలిపారు. జనవరి 26న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా సమీపం లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఆనందపూర్‌లో రెండు గోదాములు, ఒక మోమో తయారీ కర్మాగారం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వాటిలో పని చేసే కార్మికులు సజీవ దహనమయ్యారు.కాగా, కాలిన భవనాల నుంచి తాజాగా 13 మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 21కు చేరినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇంకా 28 మంది ఆచూకీ లభించలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరుగవచ్చని అన్నారు. ఇప్పటి వరకు వెలికితీసిన 21 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించి మృతులను గుర్తించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి, ఇతర బీజేపీ నాయకులు అగ్నిప్రమాద ప్రాంతాన్ని సందర్శించాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అక్కడ నిషేధిత ఆజ్ఞలు విధించారు. ప్రజల రాకపోకలను నియంత్రించారు. ఈ నేపథ్యంలో సమీపంలోని ఆలయం నుంచి సంఘటనా స్థలానికి పాదయాత్ర కోసం అనుమతి కోరుతూ సువేందు అధికారి కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు.

# గర్భిణీ మహిళా కమాండో హత్య భర్త అరెస్ట్



**వేద న్యూస్ న్యూఢిల్లీ :**

దేశ రాజధాని న్యూఢిల్లీలో గర్భిణీ మహిళా కమాండో హత్యకు గురైన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఢిల్లీ పోలీస్ శాఖలో స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ బృందంలో మహిళా కమాండోగా పనిచేస్తున్న 27 ఏళ్ల కాజల్ చౌదరిని ఆమె భర్త అంకుర్ దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. డంబెల్‌తో తలపై పలుమార్లు కొట్టడంతో తీవ్రంగా గాయపడిన కాజల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కాజల్ 2022లో ఢిల్లీ పోలీస్ శాఖలో ఉద్యోగంలో చేరింది. ప్రస్తుతం స్వాట్ బృందంలో మహిళా కమాండోగా విధులు నిర్వహిస్తోంది. 2023లో ఢిల్లీ కంటోన్మెంట్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్న అంకుర్‌తో ఆమెకు వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు ఉన్నాడు. అయితే ఆర్థిక విషయాలపై భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. జనవరి 22న నాలుగు నెలల గర్భవతిగా ఉన్న కాజల్ తన సోదరుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో అంకుర్ ఆమెపై డంబెల్‌తో దాడి చేశాడు. తలపై పలుమార్లు కొట్టడం తో ఆమె తీవ్రంగా గాయపడింది. ఫోన్‌లో ఉన్న సోదరుడు దాడి విషయాన్ని గమనించి వెంటనే స్పందించినట్లు సమాచారం. తీవ్ర గాయాల కారణంగా కాజల్ జనవరి 27న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదనపు కట్నం కోసం కాజల్‌ను వేధించారని ఆరోపించాడు. పోలీసులు అంకుర్‌పై హత్య కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు.



# లోయలోకి దూసుకెళ్లబోయిన బస్సు..

**– తృటిలో తప్పిన పెను ప్రమాదం**



**వేద న్యూస్ సిమ్లా:**

పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపు తప్పింది. కింద నది ఉన్న లోయలోకి దూసుకెళ్ల బోయింది అదృష్టవశాత్తు అందులోని పర్యాటకులకు పెను ప్రమాదం తప్పింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం చన్నిఖోడ్ సమీపంలోని భూంతర్–మణికరణ్ రహదారిపై పర్యాటకులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు నుంచి జారి లోయలోకి దూసుకెళ్లబోయింది. అదృష్టవశాత్తూ బస్సు ముందు భాగం రోడ్డుపైకి వచ్చి ఆగింది. దీంతో లోయ కింద ప్రవహిస్తున్న పార్వతి నదిలో ఆ బస్సు పడే ప్రమాదం తప్పింది. కాగా, ఆ బస్సులోని ప్రయాణికులు ఆందోళన చెందారు. భయంతో కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించారు. బస్సులోని పర్యాటకులను సురక్షితంగా కిందకు దించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రయాణికులు క్షేమంగా ఉండటంతో అంతా ఊరట చెందారు. లోయలోకి జారుతున్నట్లుగా ఉన్న బస్సు వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# అన్నం పెట్టిన ఇంటికే కన్నం




**వేద న్యూస్ బెంగళూరు :**

**– రూ.18 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాహా**

బెంగళూరులోని మారథహళ్లి ప్రాంతంలో భారీ దోపిడీ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. భర్తతో కలిసి ఇంట్లో పనిచేస్తున్న పనిమనిషి యజమాని ఇంటికే కన్నం వేసి కోట్ల రూపాయల ఆస్తిని దోచుకెళ్లిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, శివకుమార్ అనే బిల్డర్ ఇంట్లో పని చేసేందుకు తొమ్మిది నెలల క్రితం నేపాల్‌కు చెందిన దినేష్, కమల, అంబికలు వచ్చారు. వీరు ఇంట్లో నమ్మకంగా పని చేస్తూ కుటుంబ సభ్యుల కదలికలపై పూర్తి అవగాహన సంపాదించారు. ఈ క్రమంలో శివకుమార్ కుటుంబం ఒక ఫ్యామిలీ ఫంక్షన్ కోసం బయటకు వెళ్లిన సమయంలో, పనిమనిషి అంబిక భర్తతో పాటు మరో ముగ్గురితో కలిసి ఇంట్లోకి చొరబడి దోపిడీకి పాల్పడింది. ఇంట్లో ఉన్న లాకర్లు, అల్మారాలను తెరిచి విలువైన ఆభరణాలు, నగదును కొల్లగొట్టారు. ఈ ఘటనలో మొత్తం 11.5 కిలోల బంగారు ఆభరణాలు, వజ్రాలు, 5 కిలోల వెండి వస్తువులు, రూ.11.5 లక్షల నగదును దోచుకుని నిందితులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తం దోపిడీ విలువ సుమారు రూ.18 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటన నగరంలో తీవ్ర చర్చకు దారి తీసింది.

# భారత్ యాత్ర కార్డు వచ్చేసింది..

**వేద న్యూస్ డెస్క్:**




దేశవ్యాప్తంగా ప్రయాణికులకు సౌకర్యంగా ఉండే కొత్త భారత్ యాత్ర కార్డు అందుబాటులోకి వచ్చింది. ఇకపై భూగర్భ రైలు, రోడ్డు రవాణా సంస్థ బస్సులు, రైలు సేవల కోసం వేరువేరుగా టికెట్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా ఒకే కార్డుతో చెల్లింపులు చేయవచ్చు. ఈ కార్డు ద్వారా సమయం ఆదా అవడంతో పాటు ప్రయాణం మరింత సులభంగా మారనుంది. దేశీయ చెల్లింపు విధానం ఆధారంగా రూపొందించిన ఈ కార్డు పర్యాటకులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్డుతో స్పర్శలేని చెల్లింపులు చేయవచ్చు. కేవలం యంత్రానికి దగ్గరగా చూపితే చార్జీలు స్వయంచాలకంగా కట్ అవుతాయి. కార్డును సులభంగా రీచార్జ్ చేసుకునే అవకాశం ఉంది. గరిష్టంగా 2000 వరకు మొత్తాన్ని నిల్వ చేసుకోవచ్చు. ఈ కార్డు వినియోగానికి ఎలాంటి గుర్తింపు ధృవీకరణ అవసరం లేదు. మొబైల్ సంఖ్య మరియు సంకేత చిత్ర ఆధారంగా కార్డును సక్రియం చేసుకోవచ్చు. ఈ కార్డును ఇంటి వద్దకే ఆర్డర్ చేసుకునే సదుపాయం ఉంది. 50 ఫీజుతో ఆర్డర్ చేయగానే కొద్ది నిమిషాల్లోనే కార్డు అందుతుంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో అన్ని నగరాలకు విస్తరించనున్నట్లు సమాచారం. కార్డు అందిన తర్వాత ప్రత్యేక అనువర్తనం ద్వారా కార్డు వెనుక ఉన్న సంకేత చిత్రాన్ని పరిశీలించి సక్రియం చేసుకోవాలి. ఈ విధంగా ఒకే కార్డుతో అన్ని ప్రయాణ సేవలు పొందే అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# రూ.500 ఇస్తే చిల్లర వర్షమే.. ఏటీఎంలోనే 10, 20 నోట్లు..!

**వేద న్యూస్ డెస్క్:**



రోజూ ఎదురయ్యే పెద్ద సమస్య చిల్లర లేమి. జేబులో రూ.500 నోటు ఉన్నా టీ కొనాలన్నా, ఆటో చార్జీ ఇవ్వాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వ్ బ్యాంకు కలిసి కొత్త తరహా ఏటీఎంలను ప్రవేశపెట్టాయి. ఇకపై ఈ యంత్రాల్లో పెద్ద నోటు ఇస్తే అవసరమైన చిన్న నోట్లు వెంటనే లభించనున్నాయి. ఈ కొత్త యంత్రాల్లో రూ.10, రూ.20, రూ.50 నోట్లు ప్రత్యేకంగా నిల్వ ఉంటాయి. రోజువారీ అవసరాల కోసం చిన్న మొత్తంలో నగదును తీసుకునే సౌకర్యం ఉంటుంది. అలాగే మీ వద్ద ఉన్న రూ.500 నోటును యంత్రంలో ఉంచితే అది అవసరమైన చిల్లర నోట్లుగా మారి బయటకు వస్తుంది. దీనివల్ల మార్కెట్లు, బస్సు ప్రయాణాలు, చిన్న దుకాణాల్లో చిల్లర కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ ప్రయోగాన్ని మొదట ముంబై నగరంలో ప్రారంభించారు. రైల్వే స్టేషన్లు, బస్ నిలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, రద్దీ మార్కెట్లలో ఈ యంత్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ మంచి ఫలితాలు వస్తే దేశవ్యాప్తంగా విస్తరించనున్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటికీ నగదు వినియోగం ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం సామాన్యులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇకపై చిల్లర కోసం టెన్షన్ అవసరం లేకుండా ఏటీఎంలోనే సులభంగా పరిష్కారం దొరకనుంది.

# ఉద్యోగులకు బంపర్ గుడ్ న్యూస్..

**– వేతన పరిమితి పెంపుతో పింఛన్ లాభాలు రెట్టింపు..!**




**వేద న్యూస్ డెస్క్:**

దేశంలో ఉద్యోగుల సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా ముందుకెళ్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న నెలకు 15000 రూపాయల వేతన పరిమితిని 25000 రూపాయలకు పెంచే ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నాయి. ఈ మార్పు అమలైతే ఇప్పటివరకు ఈ పథకం పరిధిలోకి రాని లక్షలాది ఉద్యోగులకు దీర్ఘకాలిక పొదుపు, పింఛన్ భద్రత లభించే అవకాశం ఏర్పడుతుంది. వేతన పరిమితి అంటే ఒక ఉద్యోగి మరియు యజమాని తప్పనిసరిగా భవిష్య నిధికి, పింఛన్ పథకానికి చెల్లించాల్సిన గరిష్ట జీత హద్దు. ప్రస్తుతం ఈ హద్దు 15000 రూపాయలుగా ఉండటంతో ఎక్కువ జీతం పొందే చాలా మంది ఉద్యోగులు ఈ భద్రతా ప్రయోజనాలకు దూరమవుతున్నారు. జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రతిపాదన త్వరలోనే ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు రానుంది. అవసరమైన ఆమోదాలు లభిస్తే ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి న్యాయస్థానాల సూచనలు కూడా ప్రధాన కారణంగా మారాయి. దేశంలో జీతాలు, జీవన ఖర్చులు పెరిగినా పాత పరిమితి కొనసాగడంపై విమర్శలు వచ్చాయి. ఈ మార్పు అమలైతే ఎక్కువ మంది ఉద్యోగులు భవిష్య నిధి, పింఛన్ లాభాలను పొందగలుగుతారు. దీర్ఘకాలంలో ఆర్థిక భద్రత మెరుగవడంతో ఉద్యోగుల కుటుంబాలకు కూడా స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రభుత్వ నిర్ణయం ఖరారైతే ఉద్యోగులకు ఇది నిజంగా శుభవార్తగా మారనుంది.

# భారీ బ్యాటరీతో సూపర్ ఫోన్ దుమ్మురేపుతోంది..!

**వేద న్యూస్ డెస్క్:**



భారీ బ్యాటరీ సామర్థ్యంతో కొత్త తరం మొబైల్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. సాధారణంగా ల్యాప్‌టాప్‌ల లో కనిపించే స్థాయి శక్తిని ఇప్పుడు చేతిలో పట్టుకునే మొబైల్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఒకసారి పూర్తిగా చార్జ్ చేస్తే రోజుల తరబడి ఉపయోగించుకునే విధంగా ఈ ఫోన్ రూపొందించారు. పవర్ బ్యాంక్ అవసరం లేకుండా ప్రయాణాల్లో, కార్యాలయాల్లో, వినోద వినియోగంలో నిరంతరంగా పనిచేసే సామర్థ్యం దీని ప్రధాన ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ మొబైల్‌లో 10001 సామర్థ్యం గల భారీ బ్యాటరీ అమర్చారు. దీని వల్ల వీడియోలు చూడటం, ఆటలు ఆడటం, ఆన్‌లైన్ పనులు చేయటం వంటి అన్ని కార్యకలాపాలు దీర్ఘకాలం నిరభ్యంతరంగా కొనసాగించవచ్చు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మూడు వేర్వేరు మెమరీ, నిల్వ ఎంపికలతో ఈ ఫోన్ అందుబాటులోకి వస్తోంది. ప్రారంభ ధరను 23999గా నిర్ణయించారు. ఫిబ్రవరి 5 నుంచి ప్రముఖ ఆన్‌లైన్ వేదికలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. మధ్యతరగతి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఆకర్షణీయమైన రూపకల్పన, బలమైన పనితీరు, దీర్ఘకాలిక బ్యాటరీ శక్తితో ఈ మొబైల్ విడుదలైంది. బ్యాటరీ త్వరగా అయిపోతుందనే టెన్షన్ లేకుండా నిరంతర వినియోగం కోరుకునే వారికి ఇది సరైన ఎంపికగా మారనుంది.

వేద న్యూస్

శుక్రవారం జనవరి 30, 2026

# రాధిక కనిపించడంలేదే..

## కావాలనే బ్రేకా.. లేక ఆఫర్లు లేవా..



**వేద న్యూస్ డెస్క్:**

నేహా శెట్టి చాలా రోజులుగా సినిమాల్లో కనిపించకపోవడంతో అభిమానుల్లో అనేక అనుమానాలు మొదలయ్యాయి. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి తరువాత హీరోయిన్‌గా మారిన ఈ ముద్దుగుమ్మ 2016లో కన్నడ సినిమా ముంగారు మలే 2తో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి అందంతో పాటు నటనతోనూ గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో మెహబూబా, గల్లీ రౌడీ, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, డిజే టిల్లు, బెదురులంక 2012, రూల్స్ రంజన్, టిల్లు స్క్వేర్, గ్యాంగ్స్ అఫ్ గోదావరి వంటి చిత్రాల్లో నటించి మంచి క్రేజ్ సంపాదించింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన మెహబూబా సినిమాతో తొలి గుర్తింపు దక్కింది. సినిమా పెద్దగా ఆకట్టుకోకపోయినా నేహా అందానికి మాత్రం మంచి మార్కులు పడ్డాయి. మోడలింగ్ రంగంలోనూ ఆమె మంచి గుర్తింపు పొందింది. 2014లో మిస్ మంగళూరు అందాల పోటీలో విజేతగా నిలిచింది. 2015లో మిస్ సౌత్ ఇండియా రన్నరప్‌గా నిలిచి మరింత పేరు తెచ్చుకుంది. టిల్లు స్క్వేర్ సినిమాలో చిన్న పాత్ర చేసింది. అలాగే పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. అయితే ఆ పాటను సినిమా నుంచి తొలగించారు. తర్వాత యూట్యూబ్‌లో విడుదల చేసినప్పటికీ పెద్దగా స్పందన రాలేదు. ప్రస్తుతం నేహా శెట్టి హీరోయిన్‌గా కొత్త సినిమాలు చేయడం లేదు. దీంతో ఆమె అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కావాలనే కెరీర్ స్పీడ్ తగ్గించిందా లేక ఆమెకు ఆఫర్లు రావడం లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఆమె షేర్ చేసే ఫోటోలకు మంచి స్పందన వస్తోంది. మళ్లీ ఎలాంటి ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తుందో చూడాలి అని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు

# ఓటీటీలోకి దూసుకొచ్చిన వరుణ్ సందేశ్ కానిస్టేబుల్

**వేద న్యూస్ డెస్క్:**




యంగ్ హీరో వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలో నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ కానిస్టేబుల్ ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేసింది. గత ఏడాది అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తాజాగా ప్రముఖ ఓటీటీ వేదికలో స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిశ్రమ స్పందన పొందినప్పటికీ, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నంలో ఉంది. ఈ సినిమా కథ శంకరపల్లి అనే గ్రామం చుట్టూ తిరుగుతుంది. వరుస హత్యలు ఆ గ్రామాన్ని వణికిస్తుంటాయి. అదే సమయంలో అక్కడ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాశీ మేనకోడలు కూడా దారుణ హత్యకు గురవుతుంది. సొంత మనిషిని కోల్పోయిన బాధతో కాశీ ఆ హంతకుడిని పట్టుకోవాలని పట్టుదలగా ముందుకు సాగుతాడు. సీరియల్ కిల్లర్ వెనుక ఉన్న అసలు రహస్యాలు ఏమిటి, అతడిని కాశీ ఎలా పట్టుకున్నాడు అనే అంశాలు ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతాయి. లవర్ బాయ్ ఇమేజ్‌తో గుర్తింపు తెచ్చుకున్న వరుణ్ సందేశ్ ఈ సినిమాలో సీరియస్ పోలీస్ పాత్రలో కనిపించడం విశేషం. ఆయన నటనకు మంచి మార్కులు పడుతున్నాయి. కథానాయికగా మధులిక వారణాసి నటించగా, మురళీధర్ గౌడ్, రవివర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం థ్రిల్లర్ ప్రేమికులకు మంచి ట్రీట్‌గా మారుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# రణవీర్ సింగ్‌తో బోయపాటి?





**వేద న్యూస్ డెస్క్:**


టాలీవుడ్ మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను తదుపరి ప్రాజెక్ట్ గురించి నెట్టింట ఆసక్తికర చర్చ సాగుతోంది. అఖండ, అఖండ 2 చిత్రాలతో భారీ విజయాలు అందుకున్న బోయపాటి ఇప్పుడు బాలీవుడ్ వైపు అడుగులు వేయనున్నారనే టాక్ హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఆయన ముంబై వెళ్లి ప్రముఖ నటుడు రణవీర్ సింగ్‌ను కలిసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అక్కడ ఒక భారీ యాక్షన్ కథను వినిపించారని, ఆ కథ రణవీర్‌కు బాగా నచ్చిందని సమాచారం. గతంలో కొన్ని ప్రాజెక్టులు కారణాల వల్ల ఆగిపోయిన నేపథ్యంలో ఇప్పుడు బోయపాటి చెప్పిన హై వోల్టేజ్ మాస్ కథ రణవీర్‌ను ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ గనుక పట్టాలెక్కితే బోయపాటికి కెరీర్‌లోనే అతిపెద్ద అవకాశం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. రణవీర్ లాంటి స్టార్‌తో సినిమా అంటే అది పాన్ ఇండియా స్థాయిలో భారీ సంచలనం సృష్టించే అవకాశం ఉంది. బోయపాటి మార్క్ ఉగ్ర మాస్ యాక్షన్, రణవీర్ సింగ్ ఎనర్జీ కలిస్తే వెండితెరపై పూనకాలు రావడం ఖాయమని అభిమానులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఇది చర్చల దశలోనే ఉన్నప్పటికీ, అధికారిక ప్రకటన వెలువడితే ఇండియన్ సినిమా రంగంలో పెద్ద షేక్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్ నిజమవుతుందా లేదా అన్నది త్వరలో తేలనుంది.

# పాన్ ఇండియా కలలతో బాలీవుడ్ బాటలో ప్రీతి..

## – కోలీవుడ్‌కు రెడీ అవుతున్న మృణాల్.. డబుల్ సెన్సేషన్..!

**వేద న్యూస్ డెస్క్:**





వారానికో కొత్త కథానాయిక రంగప్రవేశం చేస్తున్న ఈ రోజుల్లో సినీ పరిశ్రమలో నిలదొక్కుకోవడం హీరోయిన్లకు పెద్ద సవాలుగా మారింది. అందుకే క్రేజ్ ఉన్నప్పుడే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో వారు ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా పాన్ ఇండియా ధోరణి బలపడిన తర్వాత ఒక్క భాషకే పరిమితం కాకుండా అన్ని పరిశ్రమల్లో తమ సత్తా చాటాలనే ఆలోచన పెరుగుతోంది. ఒకవైపు ఉత్తరాది భామలు దక్షిణాది సినిమాలపై దృష్టి పెడుతుంటే, మరోవైపు దక్షిణాది కథానాయికలు బాలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఇద్దరు హీరోయిన్లు తీసుకుంటున్న కీలక నిర్ణయాలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. టాలీవుడ్‌లో ఓం భీమ్ బుష్ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన ప్రీతి ముకుందన్, ఆ తర్వాత తమిళ చిత్రాల్లోనూ అవకాశాలు దక్కించుకుంది. కన్నప్ప చిత్రంలో నెమలి పాత్రతో మంచి గుర్తింపు సంపాదించగా, మలయాళంలో సర్వం మాయ చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఇలా అన్ని భాషల్లో తనకంటూ ఓ మార్క్ క్రియేట్ చేసిన ప్రీతి ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ యువ హీరో సరసన ఆమె నటించే అవకాశముందని సమాచారం. ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని, అన్నీ అనుకూలిస్తే త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సాధించాలన్న లక్ష్యంతో ప్రీతి ఈ అడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అందాల భామ మృణాల్ ఠాకూర్ కోలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే తెలుగు చిత్రాల్లో మంచి క్రేజ్ సంపాదించిన మృణాల్ ప్రస్తుతం భారీ ప్రాజెక్టులలో నటిస్తోంది. దీనితో పాటు హిందీ చిత్రాల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తమిళ పరిశ్రమ నుంచి వచ్చిన అవకాశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడి దర్శకత్వంలో స్టార్ హీరో సరసన తెరకెక్కనున్న రొమాంటిక్ డ్రామాలో ఆమెను ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. అన్ని వ్యవహారాలు సవ్యంగా జరిగితే ఈ చిత్రంతోనే మృణాల్ కోలీవుడ్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇలా ఒకవైపు ప్రీతి బాలీవుడ్ వైపు అడుగులు వేస్తుండగా, మరోవైపు మృణాల్ కోలీవుడ్‌లో ఎంట్రీకి సిద్ధమవడం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. పాన్ ఇండియా గుర్తింపు కోసం హీరోయిన్లు తీసుకుంటున్న ఈ వ్యూహాత్మక నిర్ణయాలు రాబోయే రోజుల్లో వారి కెరీర్‌ను ఏ స్థాయికి తీసుకెళ్తాయో చూడాలి.

# ప్రపంచకప్‌కు 3 రోజులు ముందు సుందర్‌కు దేహసామర్థ్య పరీక్ష..

**వేద న్యూస్ డెస్క్:**



ప్రపంచకప్ 2026కు ముందు భారత జట్టులో ఆందోళన నెలకొంది. స్టార్ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ టోర్నీలో ఆడగలడా లేదా అన్న సందేహాలు కొనసాగుతున్నాయి. గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతని దేహసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు 4న బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి శిక్షణ కేంద్రంలో కీలక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 11న న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో సుందర్ పక్కటెముకల వద్ద గాయపడిన సంగతి తెలిసిందే. ఊహించినదానికంటే కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది. అధికారిక వైద్య నివేదిక వచ్చేవరకు ఎలాంటి ప్రత్యామ్నాయాన్ని ప్రకటించవద్దని సెలక్టర్లు నిర్ణయించారు. నిబంధనల ప్రకారం 30లోపు జట్లలో మార్పులు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ గాయం కారణంగా అవసరమైతే టోర్నీ మధ్యలో కూడా మార్పులు చేసుకునే వీలు ఉంటుంది. భారత జట్టు 3న ముంబయిలో సమావేశమై 4న దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ ఆడనుంది. అదే రోజు సుందర్‌కు దేహసామర్థ్య పరీక్ష జరగనుండటంతో ఈ నిర్ణయం మరింత కీలకంగా మారింది. వైద్య వర్గాల సమాచారం ప్రకారం పక్కటెముకల దగ్గర కండరాల్లో చీలిక ఏర్పడినట్టు తెలుస్తోంది.

# ఆసీస్ కెప్టెన్ పగ్గాలు సోఫీ చేతుల్లోకి..

## – యువ వయసులోనే భారీ బాధ్యత..!



**వేద న్యూస్ డెస్క్:**

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టుకు కొత్త ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా సోఫీ మోలినెక్స్‌ను నియమించినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. ఇప్పటివరకు జట్టును విజయవంతంగా నడిపించిన అలిస్సా హీలీ స్థానంలో ఈ బాధ్యతలు మోలినెక్స్ చేపట్టనుంది. కేవలం 28 ఏళ్ల వయసులోనే ఇంత పెద్ద బాధ్యత రావడం ఆమె ప్రతిభకు, నాయకత్వ లక్షణాలకు నిదర్శనంగా మారింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత్ మహిళల జట్టుతో జరిగే సిరీస్ నుంచే మోలినెక్స్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనుంది. అయితే ఆ సిరీస్‌లో ఆమె టీ20 జట్టుకు మాత్రమే నాయకత్వం వహించనుంది. వన్డే, టెస్ట్ జట్లకు అలిస్సా హీలీ కొనసాగనుంది. ఈ సిరీస్ పూర్తయ్యాక అన్ని ఫార్మాట్ల పగ్గాలు మోలినెక్స్‌కు అప్పగించనున్నారు. కెప్టెన్‌గా ఎంపిక కావడంపై మోలినెక్స్ స్పందిస్తూ ఇది తనకు ఎంతో గర్వకారణమని, దేశానికి నాయకత్వం వహించే అవకాశం రావడం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని పేర్కొంది. జట్టును మరింత విజయపథంలో నడిపించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేసింది. కొత్త నాయకత్వంతో ఆసీస్ మహిళల జట్టు మరింత బలంగా ముందుకు సాగుతుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఏపీ కేబినెట్ తీపికబురు.. జ్యోతి యర్రాజీ కళ్లలో ఆనందం!

**వేద న్యూస్ డెస్క్:**




అర్జున అవార్డు విజేత అథ్లెట్ జ్యోతి యర్రాజీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ గౌరవం కల్పించింది. విశాఖలో 500 చదరపు గజాల స్థలం కేటాయించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. అంతేకాదు జ్యోతి డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలన్న ప్రతిపాదనకూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ శుభవార్తపై జ్యోతి యర్రాజీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2025లో ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో జ్యోతి స్వర్ణ పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆమె అద్భుత విజయానికి మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలియజేస్తూ ఆర్థిక సహాయం కూడా అందించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. జ్యోతి వంటి ప్రతిభావంతుల విజయాలు రాష్ట్ర యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073